క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్, కేదారిపురం ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు కురుపాం ఏడీఈ మండంగి రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

పాలకొండ రూరల్: విద్యుత్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ కె.విష్ణుమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లుంబూరు సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ ఫీడర్‌కు అనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు నిర్వహణ పనులు చేపడతామన్నారు. దీంతో స్థానిక గాసీ వీధి, చిన్నకాపు, పెద్ద కాపు వీధులతో పాటు నెయ్యిల వీధి, గారమ్మకాలనీ, లుంబూరువారి వీధి, అగ్నిమాపక కేంద్ర పరిసరాలు, మండల పరిధిలో తుమరాడకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భామిని: మండలంలోని కొరమ ఫీడర్‌లో లైన్ మార్పు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఏఈ బి. శ్రీనివాస్ తెలిపారు. బొడ్డగూడ, మణిగ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు మూడో విడతలో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ మూటక గోపాల కృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. 27న ఏదైనా ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. వెరిఫికేషన్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సూచించారు.

సన్మానం

కురుపాం: మండలంలోని పెద్దగొత్తిలి సచివాలయం నుంచి బదిలీపై వేరే చోటకు వెళ్లిన ఉద్యోగులకు గ్రామస్తులు గురువారం సన్మానించారు. సర్పంచ్ టి.లోకనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కె.మనోహర్, వీఏఏ భార్గవి, సర్వేయర్ మన్మథ, వెటర్నరీ అసిస్టెంట్ పీవీ శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీలపై ప్రజావేదిక

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి చేసిన సామాజిక తనిఖీలపై శుక్రవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి గురువారం తెలిపారు. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు అన్ని గ్రామాల్లో జరిగిన రూ.20.7 కోట్ల పనులకు ఎస్‌ఆర్‌పీ ఈదుబిల్లి పున్నపునాయుడు పర్యవేక్షణలో ఆడిట్ బృందం తనిఖీలు చేయడం జరిగిందని, ఇప్పుడు ఆ వివరాలను ప్రజావేదికలో వెల్లడించడం జరుగుతుందన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించండి

కురుపాం: గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొండబారిడి గ్రామంలో నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గిరిజన కూలీలు, రైతులతో ఆ పార్టీ సీనియర్ నాయకులు పత్తిక మోహనరావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున గిరిజనుల ఆరోగ్యం దెబ్బతినకముందే ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేయాలన్నారు. ప్రతి గిరిజన గూడెంలో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని, అక్కడి జనానికి దోమతెరలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఆ పార్టీలో చేరిన పలువురికి ఆ పార్టీ కండువా వేసి సాదర స్వాగతం పలికారు.

వినతిపత్రం అందజేత



తహసీల్దార్ కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వీరఘట్టం: వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ.. వేతనాలు పెంచాలని కోరుతున్నా 11 ఏళ్లుగా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందిస్తున్నా తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌ఫోన్లతో విధులు నిర్వహించలేకపోతున్నామని చెప్పారు.

గర్జించిన ఆటో డ్రైవర్లు



ప్రధాన రహదారిలో ర్యాలీగా వస్తున్న ఆటో కార్మికులు

పాలకొండ: కూటమి ప్రభుత్వం తీరుపై ఆటో డ్రైవర్లు గర్జించారు. తమ జీవనోపాధిని దెబ్బతీయడమే కాకుండా ఇంతవరకు అందుతున్న వాహనమిత్ర పథకం కూడా అందించక పోవడంతో రోడ్డెక్కారు. ఈ మేరకు పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన ఆటోడ్రైవర్లు నియోజకవర్గ కేంద్రంలో గురువారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు కోటదుర్గమ్మ ఆలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు, ఆటో యూనియన్ నాయకుడు ఎం. తిరుపతిరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో వాహనమిత్ర పథకం కింద రూ. 25 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. పైగా స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవకాశం కల్పించడంతో తమకు బేరాల్లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వాహనమిత్ర పథకం అమలు చేయడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కాద రాము, పి. శేఖర్, పి. మహేష్, ఎస్. రాంబాబు, డి. దుర్గారావు, కె. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన మాజీ ఎమ్మెల్యే కృషి



బాలేరు దిగువ పొలాలకు ద్రోణి ద్వారా వస్తున్న నీరు

భామిని: పాలకొండ మాజీ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతి బాలేరు రైతులకు చేసిన మేలు సాగునీటి రూపంలో నేడు అందుతోంది. మండలంలోని బాలేరు వద్ద వంశధార వరద కాలువపై ద్రోణి(యూటీ) నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రూ. 8 కోట్లతో పనులు చేయించారు. ప్రస్తుతం భారీ వర్షాలకు వాగులలో నీరు పారి కాలువల ద్వారా పొలాలకు చేరుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం జైగురుదత్త హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ తదితర పూజల అనంతరం వీరఘట్టం ప్రాంతానికి చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీనివాసరావు దేవీ సహిత జైగురుదత్త హోమం భక్తులతో చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా శోభాయాత్ర..



శ్రీకృష్ణుని శోభాయాత్రలో పాల్గొన్న ఎస్సై, సమితి సభ్యులు, భక్తులు

పాలకొండ రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఉమ్మడి శ్రీకాకుళం శాఖ నేతృత్వంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆరు రోజులుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి జన్మ విశిష్టత, ఆయన ప్రబోధించిన గీతా సారాంశంతో పాటు పలు ఆధ్యాత్మిక, జానపద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో స్వామి శోభాయాత్ర గురువారం అంగరంగ వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై కె.ప్రయోగమూర్తితో పాటు కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండను జిల్లాగా ప్రకటించాలి

● సాధనా సమితి సభ్యులు



సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్‌కు వినతిపత్రం అందిస్తున్న సాధన సమితి సభ్యులు

పాలకొండ రూరల్: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పాలకొండను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు సమితి గౌరవ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు నేతృత్వంలో కోటదుర్గమ్మ దేవస్థానం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిందన్నారు. పాలకొండను జిల్లాగా మార్చాలని ఇదివరకే తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాలకొండను జిల్లాగా చేయాలని కోరారు. 80 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడడంతో పాటు నాగావళి నదీతీరం, పారిశ్రామికంగా ఎదిగే అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి జిల్లా ఏర్పాటుతో ముడిపడి ఉందన్నారు. మంత్రివర్గ ఉపసంఘ నాయకులు ఇక్కడి ప్రజల కోరికను తీర్చే విధంగా సహకరించాలన్నారు.అనంతరం సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు, వివిధ ప్రజా, వర్తక, వ్యాపార, రైతు, యువజన సంఘాల నాయకులు సబ్బా నానాజీరావు, వండాన కూర్మారావు, లోకనాథం చౌదరి, పాలవలస రామినాయుడు, డాక్టర్ గణపతిరావు, ద్వారపూడి అప్పలనాయుడు, కె.అప్పన్న, కిమిడి రామ్మూర్తినాయుడు, పి.రమణ, వి.రమణమూర్తి, పి.రామినాయుడు, ఎ.శంకరరావు, పవన్‌సాయి, యందవ సూరిబాబు, పైల అక్కలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీల నిరసన



తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వ అలసత్వాన్ని వ్యతిరేకిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు గుమ్మలక్ష్మీపురం మండలం, భద్రగిరి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. వేతనాలు పెంచాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని, 1810 మంది మినీవర్కర్లను మెయిన్‌వర్కర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, గ్రాట్యుటీ జీవోలో మార్పులు తేవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసీడీఎస్, తహసీల్దారు కార్యాలయాల అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.సత్యవతి, వై.కస్తూరి తదితరులు పాల్గొన్నారు. –గుమ్మలక్ష్మీపురం

పక్కాగా ఇంటి కొలతలు ఉండాలి

గరుగుబిల్లి: స్వమిత్వ పథకంలో భాగంగా చేస్తున్న సర్వేలో ప్రతి ఇంటి కొలతలు పక్కాగా ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశమైన ఆయన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఇంటి కొలతలు సహా గ్రామకంఠం కొలతలు పక్కాగా చేపట్టాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని, తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాల వద్ద క్లోరినేషన్ చేపట్టాలన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

వీరఘట్టం: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని కోరారు.

ఏడాది పొడవునా పంటల సాగుకు ప్రణాళికలు



మాట్లాడుతున్న డీపీఎం శ్రావణ్‌కుమార్‌నాయుడు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని డీపీఎం ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రకృతి వనరుల కేంద్రం యజమానులకు ప్రణాళికల రూపకల్పనపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులంతా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే ప్రకృతి సేద్యం వైపు ప్రయాణించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, రైతు సాధికార సంస్థ కన్సల్టెంట్లు ప్రవీన్, రమాప్రభ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

వీరఘట్టం: మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా బంగారుబాబును ఎన్నుకున్నారు. అలాగే కార్యకవర్గ సభ్యులుగా రాము, కోటేశ్వరరావు, చక్రధర్, తదితరులు ఎంపికయ్యారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



పంట పొలం వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు

కొమరాడ: మండలంలోని గంగారేగువలస గ్రామ పరిసరాల్లో బుధవారం రాత్రి ఏనుగులు సృష్టించిన బీభత్సంలో రైతు కోడి తిరుపతిరావుకు చెందిన రెండు ఎకరాల జొన్న పంట నాశనమైంది. ఈ మేరకు బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తాను భార్య బంగారం పుస్తెలతాడు తాకట్టుపెట్టి మరీ జొన్నచేను వేశానని, ఏనుగులు వాటిని ధ్వంసం చేశాయని వాపోయాడు. 2018 నుంచి ఏనుగులు ఇలానే చేస్తున్నా చర్యలు శూన్యమని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మళ్లీ ఇలా జరిగిందని, తనను ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన తనకు నష్టపరిహారం అందేలా అధికారులు చూడాలని లేకుంటే తనకు చావు తప్ప మరో మార్గం లేదన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీపీవో కొండలరావు

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు తెలిపారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో గురువారం చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు విరివిగా పడుతున్నందున నీరు నిల్వ ఉండిపోయి దోమల వృద్ధి జరుగుతుందని, అది జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఇంటింటికీ ఉదయం వస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు తడి,పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని, ఆ ఎరువుతో చెత్త సంపద తయారీ కేంద్రాల్లో ఎరువు తయారు చేసి రైతులకు సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. తాగునీటి బోర్లు, కాలువల వద్ద క్లోరినేషన్ చేపట్టడం జరుగుతుందన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

దయనీయ స్థితిలో రైతన్నలు



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట రమణనాయుడు

వీరఘట్టం: కూటమి పాలనలో రైతన్నల పరిస్థితి దయనీయంగా మారిందని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు కనీసం యూరియా కూడా ఈ ప్రభుత్వం అందించలేకపోతోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు ఇంటి వద్దే ఎరువులు, విత్తనాలు అందించామన్నారు. నేటి కూటమి హయాంలో ఆర్‌ఎస్‌కేల వద్ద గంటల తరబడి నిలబడినా ఒక్క యూరియా బస్తా కూడా దొరకడం లేదని చెప్పారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వావిలపల్లి హరిబాబు, రంభ శ్రీనివాసరావు ఉన్నారు.

రహదారిని మెరుగుపరచాలి



మాట్లాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

పాలకొండ: పాలకొండ – రాజాం రహదారిని మెరుగుపరచాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ నాయకుడు బీకే మూర్తి కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజాం వెళ్లే రహదారిలో మజ్జి రాముడుపేట, ఉంగరాడ మెట్ట, సంకిలి సెంటర్, తదితర చోట్ల రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రూట్‌లో తిరిగే బస్సులు పాడుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ ఈ రహదారిలో 25 పల్లెవెలుగు, 25 ఎక్స్‌ప్రెస్ బస్సులు తిరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారులను మెరుగుపరిచి సంస్థకు సహాయపడాలని కోరారు.

దివ్యాంగుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?



వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: దివ్యాంగుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా? వారికున్న ఏకైక జీవనాధారమైన పింఛన్‌ను అనర్హత పేరిట తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావుతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. అన్ని అర్హతలు ఉన్నా కొంతమంది పింఛన్లను ప్రభుత్వం తొలగిస్తోందని, పింఛన్లు కోల్పోయిన వారంతా ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. ఆర్థికభారం తప్పించుకునేందుకు దివ్యాంగుల పింఛన్లు తొలగించడమేంటని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 66 లక్షల 34 వేల పెన్షన్లు అందిస్తే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 4 లక్షల 50 వేల వరకు పెన్షన్లు తొలగించిందన్నారు. అంతటితో ఆగకుండా దివ్యాంగుల పెన్షన్ల తొలగింపుపై కూడా దృష్టిసారిస్తుండడం అన్యాయమన్నారు. ఇన్ని కుట్రలు చేసి చేయని అభివృద్ధి, సంక్షేమం చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గు అనిపించడం లేదా ప్రశ్నించారు. తొలగించిన పింఛన్లు తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.

బబ్బిడి డిపో డీలర్ మాకొద్దు..



సమావేశమైన బబ్బిడి రేషన్ డిపో పరిధిలోని గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న పంచాయతీ, బబ్బిడి గ్రామ డీఆర్‌డిపో డీలర్‌ను మార్చాలని జర్న గ్రామ సర్పంచ్ కొండగొర్రి ఉష, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండగొర్రి రాజేష్, మాజీ సర్పంచ్ పువ్వల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ కిల్లక సతీష్, వార్డు సభ్యులు కిల్లక భాస్కరరావు, కూర్మారావు తదితరులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై జర్న గ్రామంలో బబ్బిడి, బొద్దిడి, జర్నఉరిటి, చోరుపల్లి, చినవంకధార తదితర గ్రామాల ప్రజలతో గురువారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బబ్బిడి డిపో డీలర్‌గా పనిచేసిన కొండగొర్రి విజయశాంతి..రేషన్ సరుకుల పంపిణీలో పలు మార్లు అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో జూలై 25వ తేదీన పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే ఆమెనే మళ్లీ ఇక్కడ డీలర్‌గా కొనసాగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని మనమంతా వ్యతిరేకించాలన్నారు. ఆమెనే మళ్లీ ఇక్కడ డీలర్‌గా నియమించవద్దని తామంతా తీర్మానం చేసుకున్నట్లు ప్రకటించారు. ఇదే విషయం తహసీల్దార్ ఎస్.శేఖర్ వద్ద ప్రస్తావించగా బబ్బిడి డిపో డీలర్‌ను సస్పెండ్ చేయడంతో కొండుకుప్ప సేల్స్‌మేన్‌కు తాత్కాలికంగా విధులు నిర్వహించేందుకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే కొత్త నియామకం చేపడతామని తెలిపారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం



పొలంలో అంతర పంటల సాగును పరిశీలిస్తున్న జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్

గుమ్మలక్ష్మీపురం: అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, బడి నుంచి పొలంబడి సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజి తెలిపారు. మండలంలోని చినగీసాడ పంచాయతీ, గద్రజోల గ్రామంలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్థికసాయంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో అమలు చేస్తున్న కార్యక్రమాలను వారు గురువారం పరిశీలించారు. అనంతరం వారు రైతు కిల్లక సీతారాం వ్యవసాయ క్షేత్రంలో సాగు చేస్తున్న అంతర పంటలను చూసి, కాసేపు మాట్లాడారు. పండ్ల తోటల్లో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, రాగులు, కర్రపెండలం, జొన్న, కంది, తీగజాతులు, ఆకుకూరలు వేసుకోవడం వల్ల ప్రధాన పంట ఆదాయంతో పాటు, అంతర పంటల ఆదాయాన్ని కూడా అదనంగా పొందవచ్చన్నారు. ఏడాది పొడవునా పంటలను సాగు చేస్తూ అధిక ఆదాయం పొందడంతో పాటు కిచెన్‌గార్డెన్‌లు వేసుకోవడం వల్ల కుటుంబ ఆహార భద్రత సాధించవచ్చన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ పీవో రామయ్య, శ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: క్షయవ్యాధి బారినపడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డి.రామయ్య, శ్రీవాణి సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ, ఎస్‌కే పాడు గ్రామస్తులకు క్షయ వ్యాధిపై అవగాహన గురువారం కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, జ్వరం ఎక్కువ కాలం ఉన్నా, బరువు తగ్గుతున్నా వైద్యుడిని సంప్రదించి, క్షయ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు మందులు వాడుతూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

జియ్యమ్మవలస రూరల్: పశువులు, కోళ్ల వ్యాధులు బారినపడకుండా పశుపోషకులు, పాడిరైతులు, కోళ్లఫారంల యజమానులు చర్యలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్థక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అనుజి, జియ్యమ్మవలస పశువైద్య వైద్యుడు మునికుమార్‌లు సూచించారు. మండలంలోని గౌరీపురంలో నిర్వహిస్తున్న కోళ్లఫారంను వారు గురువారం సందర్శించి, కొక్కెర తెగులు రాకుండా కోళ్లకు టీకాలు వేయండి అని అవగాహన కల్పించారు.

అనుమతులు పొందాలి

భామిని: మండలంలో వినాయక మంటపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని బత్తిలి ఎస్సై జి. అప్పారావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందిన తర్వాతే మంటపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉత్సవాల వద్ద అనుమతుల క్యూఆర్ కోడ్‌ను విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

వేతనాలు పెంచండి

గరుగుబిల్లి: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కలిసి స్థానిక బస్‌స్టాండ్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. 2014 నుంచి కేంద్రం, 2019 నుంచి ఏపీ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని వారు అన్నారు. ఇదివరకు చేపట్టిన 42 రోజుల సమ్మెకు ప్రభుత్వం స్పందించి, 2024 జూలై నెలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, ఆ హామీని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం అదనపు పని, యాప్‌ల భారం ఎక్కువైందని, గతంలో తమకు ఇచ్చిన స్మార్ట్‌ఫోన్లు సరిగా పని చేయకపోవడంతో తమకు ఇచ్చిన ఆన్‌లైన్ వర్క్‌లు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా లేక ఫొటోలు అప్‌లోడ్ సమస్య ఎక్కువైందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు 5జీ నెట్‌వర్క్‌తో కూడిన ట్యాబ్‌లు అందివ్వాలని కోరారు. అనంతరం తహసీల్దారు బాలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ గౌరమ్మ, ఎం.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.